# వసంతం

తొలికోడి కూయకముందే మెలకువ వచ్చింది. ఇంత పెందలాడే నిద్రలేపిన వీధిలోని సవ్వడుల్ని గురించి ఆలోచించబోయే లోపలే ఉగాది గుర్తుకొచ్చింది. మనస్సు ఉత్సాహంతో ఉరకలేసింది.

పంచలోకెళ్ళి దేవాలయం కేసి చూశాను.

ఎవరో ఎవర్నో తరుముతున్న సడి.

కేకలు... ఈలలు... కేరింతలు... వీటికి నేపథ్యంగా కర్రోళ్ళలో రోకటి పొన్ను చేసే శబ్దాలు.

అక్కడి వాతావరణం నిండా అంతులేని ఉత్సాహం చోటుచేసుకుని ఉంది. దొంగతనంగానో, దొరతనంగానో సందేళనించి చేలమీద పడి తవ్వుకొచ్చిన పచ్చి పసుపుకొమ్ములకు సున్నం చేర్చి కర్రోళ్ళ నిండా పోసి దంచుతున్నారు. తెల్లారితే నీళ్లు తెచ్చుకొనేందుకు యిబ్బందిగా వుంటుందని, ఇప్పుడే బోరింగుల వద్ద కెళ్ళే వాళ్ళని వసంతం కోసం దంచే పసుపు తొక్కుతోనే వెంబడించి తరుముతున్నారు. చల్లని ఆ చీకటి పొద్దున యువకులు చేసే ఈ సందడి, ఎదలో ఏదో అనిర్వచనీయమైన స్పందనల్ని కలిగిస్తూ ఉంది.

దేవాలయం వద్ద కెళ్ళాలని మనస్సులో కోరికగా ఉంది.

వెళితే నాక్కూడా పరుగులు తప్పవు.

మాకు మామ వరసైన వాళ్ళ మంద దండిగా ఉంది. దాయాదుల సంఖ్య తక్కువ.

వసంత యుద్ధంలో ప్రతి ఏడాదీ, ఓటమి నించి తప్పించుకొనేందుకు మేము ఏదో ఒక ఎత్తుతో సిద్ధంగా వుండవలసిందే.

కోట వీధి నుంచి దేవాలయం వరకూ వాళ్ళ సామ్రాజ్యమే. వాళ్ళిప్పుడు నా ఉనికిని పసిగట్టినా ప్రమాదమే.

మెల్లిగా అక్కణ్ణించి జారుకుని మా వాళ్ళ యుద్ధారామం చేరుకున్నాను.

మాదళం కూడా శక్తి వంచన లేకుండా గట్టిగానే ప్రయత్నిస్తోంది.

నేను వెళ్ళేసరికి రెండు బెల్లపు పెన్నాలనిండా వసంతం తయారుచేసి ఉన్నారు.

పసుపు కొమ్మల్ని దంచేవాళ్ళు దంచుతున్నారు. సున్నం కలిపేవాళ్ళు కలుపు తున్నారు. ఇంకొందరు వసంతానికి రంగొచ్చిందో లేదోనని పరీక్షిస్తున్నారు. మరికొందరు ఆ వీధిలో వరసైన వాళ్ళని నిద్రలేపి మరీ వసంతం చల్లుతూ తరుముతున్నారు.

రోటికాడా, పెన్నంవద్దా, నీళ్ళబిందెలచెంతా... అన్ని చోట్లా తానే అయి హుషారుగా తిరుగుతోన్న బక్కపలుచటి యువకుణ్ణి చూసేసరికి నాకు ఆశ్చర్యం కలిగింది. నమ్మ శక్యం కాకుండా ఉంది.

"మనోడేందిరా వసంతాల కాడిగ్గాడ వొచ్చిండు" పక్కనే ఉన్న గురప్పను పిల్చి అడిగాను.

"యీ యేడు పండగంతా యీన్దేనన్నా! కసి దీర్చుకోవాలంట. యిన్నేండ్లూ వాల్లు జేసిన ఎగతాలికి యీ రోజు బుద్ధిజెప్పాలంట" చెప్పాడు వాడు.

నాకు వింతగా అన్పించింది.

బాలకొండన్న ఏమిటి? కసిదీర్చుకోవటం ఏమిటి?

ఏనాడూ యింట్లోంచి బైటకు రానివాడు... వసంతాల పండుగంటే పొయ్యి గడ్డల చాటున దాక్కొనేవాడు. వాడేమిటి? యీ హుషారేమిటి?

"అన్నా...అన్నా... పక్కకు తీ..." నన్ను చేత్తో వొత్తిగల జేస్తూ వసంతపు చెంబుతో వేగంగా చెంచయ్యగారి సందులోకి దూరాడు బాలకొండన్న.

సందులో కసపూడుస్తోన్న అమ్మాయే అతని లక్ష్యమని నే నూహించలేకపోయాను.

"ఏం గొర్రె బావా యిట్లొస్చాండవ్?" అతనికేసి తేలిగ్గా చూస్తూ అందాపిల్ల.

"నీ కోసమే..." అంటూ, ఆమె ఊహకందని రీతిలో చెంబులోని వసంతాన్ని నెత్తిన కుమ్మరించి వెనుదిరిగాడు.

ఆమెతో బాటు నేనూ స్థంభించిపోయాను.

తేరుకొని, తలమీంచి భుజాల పైగా ఎదల్ని ముంచెత్తి, లంగా మీదుగా పయనించిన వసంతాన్ని విదిల్చికొంటూ "గొర్రె బావా! ఉండు నీ పనిచెబ్తా" అంటూ ఇంట్లో కెళ్ళింది.

నాకో కొత్త ప్రపంచపు వింతను చూస్తోన్నట్లుగా ఉంది.

రంగు రంగుల లుంగీలు చుట్టుకొని, యౌవనపు బిగితో పొగరుగా తిరిగే యువకుల ప్రకృతికి భిన్నంగా, వేలాడే గోచీతో బెరుకు బెరుగ్గా కొండ గొర్రెలా సంచరించే బాలకొండన్న యిట్లా తయారవుతాడని నేను కలలో కూడా ఊహించలేదు.

ఏడాదికిందట అతని ప్రవర్తన తలుచుకుంటే యిప్పటికీ నవ్వొస్తూ ఉంది.

కొండన్నకు పెళ్లిజెయ్యాలని అతని తల్లితండ్రులు ఎంతగా ఆరాటపడ్డారనీ!

కాడెద్దులు దున్నేంత పొలమున్నా పిల్లనిచ్చే దిక్కులేక వాళ్ళ కాళ్ళు వీళ్ళ కాళ్ళు పట్టుకునేందుకు వంగటంలోనే నడుములు వంగిపోయి వాళ్ళకు ముసలితనం అంటింది.

కొడుక్కి పెళ్ళిరాతలేదని దిగాలుపడుతోన్న సమయంలోనే ఏ దేవుని పుణ్యాన్నో బాలమ్మ ఆ యింటికి కోడలుగా వచ్చింది. కనుముక్కు తీరు ఆకర్షణీయంగా ఉంది. శాసించే చురుకుదనం ఉన్న ఆ పిల్ల కొండన్న పూర్వజన్మ పుణ్యం వల్లనే దొరికిందను కొన్నారు అందరూ.

కొడుకు పెళ్ళితో సమస్య తీరిందనే భావించారుగాని, అదో వింత సమస్యకు దారితీస్తుందని ముసలాళ్ళు ఊహించలేకపోయారు.

అత్తవారింట్లో మూడు రాత్రిళ్ళు ఎట్లా గడిపివచ్చాడో తెలీదుగాని, యిక్కడ మాత్రం మొదటిరాత్రే తడికల వాకిలి విసురుగా లాగి యింట్లోంచి బైటపడి తెల్లార్లూ దేవాలయపు పంచలో పడున్నాడు కొండన్న.

మొదటి వారం రోజులూ ఊర్లోవాళ్ళకి సరిగ్గా అర్థం కాలేదు.

అర్థమైం తర్వాత నవ్వులు ఆగలేదు.

మొహం చాటేసుకు తిరగే బాలకొండన్నను పిల్చిమరీ గేళీ చేయటం మొదలెట్టారు.

ఎవరెన్ని విధాలుగా అల్లరి చేసినా, హితబోధ చేసినా, రాత్రిళ్ళు మాత్రం పెళ్లాం వద్దకు వెళ్ళటం లేదు కొండన్న. సహజంగా ఉన్న పిరికిదనానికి భార్య సాంగత్యపు భయం మరింత తోడై, చీకటిపడితేచాలు, అతన్ని ఇల్లొదిలి దేవాలయం చేరేలా చేస్తోంది.

అతని తల్లిదండ్రులకు ఈ సమస్య ఒక పెనుభూతమై కూచుంది. కోడల్ని చూస్తుంటే సిగ్గుతోటి భయం కూడా కలుగుతోంది.

కొడుకు పెళ్ళికోసం ఎవరెవరి కాళ్ళముందో వంగారుగాని, ఇప్పుడు ఎవరికాళ్ళు ఎట్లా పట్టుకోవాలో అర్థం కాకుండా ఉంది.

హేళనలు, హితవులు ఎక్కువయ్యే కొద్దీ బాలకొండన్నలో పిరికిదనం కూడా బలం పుంజుకోసాగింది. అందరూ ఏదో కుట్ర పన్నుతోన్నట్లుగా అన్పించింది. తన్నేదో పులిబోనులోకి నెట్టేందుకు ప్రయత్నిస్తోన్నట్లుగా కూడా గోచరించింది.

హేళన చేయటంలో మా బావ కృష్ణారెడ్డిది అందెవేసిన చేయి. వరసైన వాళ్ళని ఎవరినీ వదలడు.

బాలకొండన్న సమస్య ఆయన్ను ఆకర్షించింది. ఒకరాత్రి దేవాలయంలో ముడుచుకు పడుకొని వున్న కొండన్నను కదిపాడు. "ఓహోయ్! దేవాలయంలోంచి దిగిరా!" అన్నాడు. "కొత్తగా పెండ్లిచేసుకొని, పెండ్లాన్ని యింట్లో యిడ్సిపెట్టి దేవాలయంలో పండుకొంటాండవ్. సిగ్గులేదూ?" గట్టిగా అన్నాడు.

అప్పటికే అక్కడక్కడా ఉన్న జనం పోగయ్యారు. ఎదురవబోతోన్న హాస్య సన్ని వేశాన్ని తల్చుకుంటూ హుషారుగా మూగారు.

"పదిమంది కూచునే దేవలంలో నువ్విట్లా వొచ్చి పడుకొంటే ఊరికి అరిస్టం గాదూ! ముందు... పంచదిగు" గద్దించాడు మా బావ.

కొత్తరకంగా మొదలైన ఆయన హేళన మాకు నవ్వు తెప్పిస్తూ ఉంట

"అవ్...అవ్... అరిట్టమే. దిగు దిగు...." ఇంకో యిద్దరు వంతపాడారు.

వాళ్ళ మాటల్ని లెక్కజెయ్యకుండా మూలకు వొదిగి కూచున్నాడు బాలకొండన్న.

"రావోయ్! దేవాలయంలోంచి దిగిరా! నువ్వాడుంటే దేవునికే అంటు. వూరికి శనిద్రం... రా..." మా బావ కంఠం పెరిగింది.

"నిజమేనేమో!" అనుమానం కలిగినట్లుంది బాలకొండన్నకు. మెల్లిగా లేచి నిల్చున్నాడు.

ఇంకా తటపటాయిస్తోన్న అతన్ని అక్కడ గుమిగూడిన వాళ్ళ అదలింపులు కిందకు దింపాయి.

"ఫో... యింటికాడ ఆయమ్మి ఎగజూస్తాంటది పో..."

బాలకొండన్న ఇంటిదారి పట్టలేదు.

సుబ్బరామయ్య ఇంటివద్దకెళ్ళి మంచమ్మీద కూలబడ్డాడు.

"ఓరెబ్బీ! అతగాణ్ణి యింటికాడ కూకోనీగాకు. నీగ్గూడ శనిగొట్టుకొంటది" వెనకనించి కేకేశాడు మాబావ.

"మా యింటి కాన్నించి లేచిపోవోయ్!" సుబ్బరామయ్య రెక్కబట్టి లేపటంతో కొండన్న వీధిన పడ్డాడు.

మా బావకేసి దీనంగా చూశాడు.

"నా పానానికి నువ్వేడ దాపరించినవు కిట్టమామా! నన్ను యమునాల పట్టుకొన్నేవే...! నీకు నేనేం ద్రోహం చేసినా సోమీ?" అన్నాడు.

"ఇంటికి పోదురా ఓహోయ్?.... అతన్ని లాక్కొచ్చేందుకు మాబావ నాలుగడుగులు ముందుకేశాడు.

పరిస్థితి విషమించేట్లుందని పంగావాళ్ళ వీధికేసి పరుగులాంటి నడకతో సాగాడు బాలకొండన్న.

దేవాలయం వద్ద వీధి కూడలి నవ్వులతో గలగలలాడింది.

పంగావాళ్ళంతా బాలకొండన్నకు వరసైన వాళ్ళవటం వల్ల, ఏ ఇంటి వద్దకూ రాకుండా ఎగతాళి చేస్తూ తరుముతున్నారు.

అందరితోటి నేనూ నవ్వుతున్నాను గాని బాలకొండన్న పరిస్థితి పట్ల ఎక్కడో జాలిగా అన్పిస్తూ ఉంది. అతనికి ఒంటరితనపు ఫీలింగునిస్తూ ఇంత మోటు పరాచకాలకు ఒడిగట్టటం సబబుగా లేదేమో అనిపించింది.

ఏ యింటి వద్దా అతన్ని పడుకోనివ్వరు.

పెళ్ళామున్న తన యింట్లోకి అతను వెళ్ళడు.

అతని సమస్య ఏమిటో అర్థం చేసికొనేందుకు ప్రయత్నించే కన్నా, అతన్ని ఎగతాళి చేయటంలో లభించే ఆనందం కోసమే అందరూ ఎగమల్లుతున్నారు.

ఆలోచిస్తూ యింటికి చేరుకొన్నాను.

చంటి పాపను పక్కనేసుకుని పడుకొని ఉన్న ఇందిర అడిగింది "ఏందా సందడి?" అని.

"రోజూ వుండేదే" చెప్పాను.

అంతావిని అంది, "అట్లాంటోడు పెండ్లెందుకు సేసుకోవాల? దాని బతుకు కాల్చనా?" అని.

నేను సమాధానమివ్వకుండా మంచమ్మీద వాలాను.

అతన్ని గురించిన ఆలోచనల్తోనే మేగన్నుగా నిద్రబట్టింది.

చీకటిరాత్రి.

ఏ జామైందీ అర్థం కాలేదు.

ఏదో సవ్వడి విన్పించి మెలకువ వచ్చింది.

కళ్ళు విప్పి అటుకేసి చూశాను.

"ఛోయ్! దీని సరుకుదగల...మంచంకింద సచ్చిందీ...." ఇందిర అదలిస్తోంది.

"యేంది?" లేచి కూచుంటూ అడిగాను.

"బైటికి పోదామని కాలు కిందబెట్టబోయేతలికి కాలికి మెత్తగా తగిలింది. ఎట్టనో కరవలే. ఎంత అదిలించినా బైటికిరాలే యీ పాడుకుక్క" చెప్పింది.

మంచమ్మీనించి దిగి, కిందున్న కర్రందుకొని "నువ్వు పక్కకు తీ. దాన్ని బైటికి రప్పిస్తా" చెబుతూ కర్రను నేలకేసి పొడిచాను.

వెంటనే మంచం కింద చప్పుడైంది. "అన్నో! కుక్కగాదన్నో... నేను... బాలకొండన్నను..." అనే పీలగొంతు తోటి నిలువెత్తు ఆకారం గాభరాగా బైటకొచ్చింది.

నాకు ఆశ్చర్యమేసింది.

"ఏ యింటికాడా నన్నుండనీలే. తెలుస్తే మీరు తరుంకుంటారని మంచం కింద దూరినా" చెప్పాడు.

"కొంపబెట్టుకొని నీకీ అగచాట్లెందుకురా?" అడిగాను.

" ఆ యింటికి నేను పోలేనన్నో! అది నా పెండ్లాంగాదన్నో! నా పానానికి యెముదు... నన్ను సంపుద్ది సోమీ! నన్నీ రోజు యీన్నే వుండనీ మారాజా!... నీకు దండంబెడ్తా." అంటూ మళ్లీ మంచం కిందకు దూరబోయాడు.

"నా మంచం కిందకి దూరేదెందుకబ్బే! ఛో... ఛో.... ఛో...." ఇందిర ఎకసెక్కంగా అంటోన్నా వినిపించుకోకుండా మంచి కిందకు దూరాడు బాలకొండన్న.

'మరో మంచం మీద పడుకొందురమ్మ'ని ఎంత చెప్పినా అతను బైటకు రాలేదు.

"నీకు దండం బెడ్తా వొదినో! నన్నీడ పండుకోనీ తల్లో! ఇంటికి బోతే అది నన్ను పీక్కతింటదన్నో! అది రాచ్చేసి తండ్రో!" అంటూ సన్నగా శోకాలు తీయసాగాడు.

"ఇదేం పాడుపీడరా తండ్రీ!" గొణుక్కుంటూ ఇందిర నా మంచమ్మీద కొచ్చింది.

నేను పాప పక్కన పడుకొన్నాను.

నాకు నవ్వురాలేదు.

వాళ్ళిద్దరి మధ్య నలిగే వాతావరణాన్ని ఊహించేందుకు ప్రయత్నించసాగాను.

చాలాసేపటి తర్వాత నా పొట్టవద్ద చల్లగా అన్పించింది.

పాప పక్క తడిపినట్లుంది.

తర్వాత గుర్తొచ్చింది మంచంకింది బాలకొండన్న కూడా తడిచి వుంటాడని.

అక్కణ్ణుంచి ఎలాంటి కదలికా విన్పించలేదు.

పాప వొంటికి పోసినా లేచి బైటకు రాని బాలకొండన్న స్థితిపట్ల ఏదో నిర్వచించరాని భావనతోటే తెల్లారింది.

నా మంచం కింది తావు సురక్షితమైందిగా అతను ధృవపరచుకొని వుండొచ్చు గాని, మళ్ళీ రోజు రాత్రికే మా బావ వాసనబట్టాడు.

"ఇదేం పని ఓహోయ్?" అని నన్ను మందలించాడు.

"మంచం కింద నుంచి బైటకిరా!...." అంటూ బాలకొండన్నను గద్దించాడు.

జనం పోగయ్యారు.

ఆయనకు తోడు కొండా నారాయణ ముందుకొచ్చాడు.

మంచం కింది కొండన్నను బైటకు లాగేందుకు ప్రయత్నించారు ఇద్దరూ కలిసి. ఇంకా ముడుచుకొని మూలకు వొదిగిపోతోన్న అతన్ని కాలు దొరకబుచ్చుకొని జరజర బైటకీడ్చారు.

జనమంతా విరగబడి నవ్వుతున్నారు.

అదేదో అయాచితంగా లభించిన హాస్య ప్రదర్శనగా భావించి మహా ఆనంద పడుతున్నారు.

బాలకొండన్న గగ్గోలు పెడుతున్నాడు.

నారాయణతో కలిసి మా బావ బాలకొండన్నను భుజానికెత్తుకొన్నాడు.

అరచి గింజుకొంటోన్నా వదలకుండా మోసుకెళ్ళి అతని పెళ్ళామున్న యింట్లో పడేసి వాకిలేసి బీగం కూడా బిగించారు.

బీగం చెవిని తన మొలతాటికి కట్టుకొని వచ్చాడు మాబావ.

బాలకొండన్న ఏడుపు విని జాలితలచి ఎవరైనా వాకిలి తీసేందుకు కూడా వీల్లేకుండా చేశాడు. నవ్వి నవ్వి వూరందరికీ కడుపుబ్బి పోతోంది.

మాబావ చేష్టలు నా క్కొంత అసహజంగా అన్పిస్తున్నాయి.

అంత మోటుగా ఎగతాళి చేయటం సబబు కాదేమో! అన్పించింది.

తెల్లారిం తర్వాత బాలకొండన్న నాన్న మా బావను వెదుక్కొంటూ వచ్చాడు. యాడుండాడో చూపించమంటూ అక్కను బంగపడ్డాడు. చెంబు పట్టుకెళ్ళాడని తెలిసి చేలకేసి పరుగెత్తాడు.

ఇంట్లో ఉన్న కొడుకు కోడల్ని బైటకు తీయాలంటే మా బావ మొలకున్న తాళం చెవి కావాలి కదా!

ఊరందరికీ యిదో వినోద క్రీడగా కన్పిస్తుంది గాని, నేనే ఎందుకో ఆ హాస్యాన్ని ఆస్వాదించలేకపోతున్నాను.

నా భావాలతో పన్లేకుండా దాదాపు నెల రోజులపాటు బాలకొండన్నను ఎత్తుకెళ్లి యింట్లో పడేసి వచ్చే కార్యక్రమాన్ని మా బావ నిర్విఘ్నంగా కొనసాగించాడు.

కొంతకాలానికి అందరికీ అదో అలవాటు దృశ్యంగా మారిపోయింది.

వేసవి సెలవుల్లోనే నాకు ట్రాన్స్‌ఫరై చల్లరిగిరిగెల ప్రాంతానికి సంసారాన్ని తరలించవలసి వచ్చింది.

తర్వాత బాలకొండన్న విసయం దాదాపు మరుగున పడిపోయింది.

ఎప్పుడయినా రాత్రిళ్ళు జ్ఞప్తికొచ్చినా మా బావ అంతలావు ఎగతాళి చేసి వుండ వలసింది కాదనిపిస్తుంది. కొండన్న అమాయకమైన మొహం నన్ను జాలిగా బాధపెడుతుంది.

అట్లాంటి బాలకొండన్న యీ రోజు యింతగా చెలరేగి పోతున్నాడంటే నాకు వింతగా అన్పిస్తూ ఉంది.

"అన్నో! వాల్లొస్చాంద్రు..." ఎవరో నన్ను పట్టికుదపటంతో ఉలికిపడి చెంబు అందుకొన్నాను.

ఈలలు, కేకలేసికొంటూ మా వాళ్ళు ప్రత్యర్థులకు ఎదురెక్కుతున్నారు. దేవాలయం వద్ద రెండు వైపులా యిరువర్గాలూ మోహరించాయి.

వసంతాన్ని అందించేవాళ్ళూ అందిస్తూ వుంటే, చల్లే వాళ్ళు చల్లుతూ ఉంటే దాదాపు గంటసేపు వీధులన్నీ రణగొణ ధ్వనులతో మార్మోగాయి.

వసంతం కళ్ళల్లో పడకుండా చేతులు అడ్డుంచుకొని మొండిగా ప్రతిఘటిస్తూ మెరుపు వేగంతో అవతలి గుంపులో జొరబడి ఒకణ్ణి ఎత్తుకొచ్చాడు బాలకొండన్న. వాణ్ణి బెల్లపు పెన్నాల దాకా మోసుకెళ్ళి అందులోని వసంతంలో పడేసి ముంచెత్తుతూ అల్లరిజేస్తూ వదిలాడు.

ఈ సందడిలో మావాణ్ణి కూడా ఒకణ్ణి వాళ్ళు ఎత్తుకెళ్లారు.

సూర్యకిరణాలు ఇళ్ళ చాటునించి సూటిగా వచ్చి వీధుల్లో ఎర్రగా ప్రవహించే వసంతం మీదపడి ఏ రంగుతో ప్రతిఫలించాలో అర్థంగాక వెర్రిమొగం వేసికొనేదాకా వసంత యుద్ధం కొనసాగింది.

తర్వాత రెండుజట్లూ కలిసి ఊరిబైటి దిగుడు బావి కేసి ప్రయాణమయ్యారు.

ఇంట్లో చెంబెడో, అరచెంబెడో తయారుచేసి పెట్టుకొన్న వసంతంతో వీధుల్లో వెళ్ళే యువకుల్ని కసిదీరా ముంచెత్తారు ఇళ్ళల్లోని స్త్రీలు.

వసంతం లేని కొందరు కడుగునీళ్ళను చల్లారు.

చెంచయ్య కూతురు పేడ నీళ్ళతో బాలకొండను తడిపి కసిదీర్చుకుంది.

దాదాపు రెండుగంటల సేపు బావులు దద్దరిల్లేలా ఈదులాడి ఇళ్ళకొచ్చాము.

బాలకొండన్న హుషారు నాకింకా ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంది. తోటి యువకులకంటే ఎక్కువ ఉత్తేజంతో వెలిగే అతని ప్రవర్తన నాకెంతో వింతగా ఉంది.

లుంగీ కట్టడం, మీసాల్ని పెంచటం... అన్నీ నూతనంగానే ఉన్నాయి.

అతనింత కొత్తమనిషిగా తయారుకావటానికి సహాయపడ్డ బలమైన శక్తులేవో నా ఊహకు అందటం లేదు.

వసంతం ప్రవహించిన వీధి కూడళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి.

ఇంట్లోకెళ్ళేసరికి బాలకొండన్న పెళ్ళాం బాలమ్మ కన్పించింది.

మా బావతో ఏదో మాట్లాడుతోంది.

నన్ను గమనించివుంటే కొంత సంకోచించివుండేదేమో!

"కిట్టయ్యా! నాకు నువ్వు దేవున్లాంటోనివయ్యా! నువ్వు లేకుంటే నా సంసారం నిలబడేది కాదు. అందుకే దేవునికాడ టెంకాయ కొట్టి తొలి వొప్పు నీకే యిస్తాంద.... తీసుకోయ్యా!" అంది.

"నాదేముందమ్మా! మీ అత్తామామలు, ఊర్లోవాళ్ళూ అందరూ సాయం సెయ్యబట్టి నేనట్లా జేసినా.." మా బావ అన్నాడు. అంతులేని తృప్తితో కాబోలు అతని కళ్ళు తడితడిగా మారాయి.

ఆమె తన కాళ్ళకూ దండంబెట్టి వెనుదిరిగిపోతోంటే ఆయన కళ్ళల్లోంచి జలజల నీళ్ళు రాలాయి.

నాకింతదాకా అసహ్యాన్నీ ఆవేదననూ కలిగించిన మొరటు హాస్యం వెనక యింత పరమార్థం దాగుంటుందని కలలో కూడా ఊహించలేదు.

శిలను జీవమున్న శిల్పంగా మార్చుకొనేందుకు మా బావ సహాయం ఆ అమ్మాయికి ఎంతయినా ఉపకరించింది.

బాలకొండన్నలోని విశిష్టమైన మార్పువెనక, అతని వ్యక్తిత్వపు పునర్నిర్మాణం వెనక పనిచేసిన శక్తి ఏమిటో నాకిప్పుడు బాగా అర్థమైంది.

ఇప్పటిదాకా అతను అందరిమీదా వీరాభిమన్యుడిలా విజృంభించి చిమ్మిన వసంతం- దంచిన పసుపులోంచి కాకుండా - పచ్చి పసుపు కొమ్ములాంటి బాలమ్మ హృదయంలోంచి వచ్చినట్లుగా అన్పిస్తూ ఉంది నాకు.

◆ *ఆంధ్రప్రభ వీక్లీ-31.3.2001* ◆